క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో రూ.1.60 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో ఎమ్మెల్యే దివాకర్‌రావు గురువారం శంకుస్థాపన చేశారు. 2వ వార్డులో రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు, రూ. 5 లక్షల నిధులతో పూసల సంఘం భవనానికి భూమిపూజ చేశారు. 12వ వార్డులో రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, 4వ వార్డులో రూ.65 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు మున్సిపల్ చైర్మన్ రాజయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు.

పారిశుధ్య పనులు అడ్డగింత



అడ్డుకుంటున్న జీపీ కార్మికులు

దండేపల్లి: మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించకుండా ఉండేందుకు సర్పంచ్ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి శ్రీలత ప్రత్యేక చొరవతో గురువారం కూలీలతో పనులు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెలో ఉన్న జీపీ కార్మికులు ఈ విషయం తెలిసినా వెంటనే పారిశుధ్య పనులను అడ్డుకున్నారు. మా సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని, అప్పటివరకు పారిశుధ్య పనులు చేపట్టవద్దని చెప్పి కూలీలను వెనక్కి పంపారు.

నేత్రదానం



సువర్ణ దేవి (ఫైల్)

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రానికి చెందిన మాదాసు సువర్ణదేవి(55) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె నేత్రాలను సదాశయ ఫౌండేషన్ సహకారంతో దానం చేశారు. కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో నేత్రదానికి ముందుకు వచ్చారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ల ద్వారా సేకరించినట్లు పేర్కొన్నారు. మృతురాలి భర్త రవీందర్‌రావు, కూతురు వందన, అల్లుడు నవీన్, కొడుకు నవీన్‌కుమార్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి. శ్రవణ్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, రాంరెడ్డి శ్రీనాథ్, మహేందర్ రాజు, శ్రీనాథ్ అభినందించారు.

రేపు బీసీ జాగృతి రౌండ్‌టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న నరెడ్ల శ్రీనివాస్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో తెలంగాణ బీసీ జాగృతి రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో 'బీసీల పాత్ర' అనే అంశంపై బీసీ సామాజిక వర్గాలకు చెందిన పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థి, కుల సంఘాలు, జర్నలిస్టులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వారు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేశ్, ఉపాధ్యక్షుడు చింతల మల్లేశ్, కోశాధికారి చల్ల విజయ్‌కుమార్, పట్టణ కార్యదర్శి ఎంబడి కిషన్, మంచర్ల సదానందం, ఏదునూరి రమేశ్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్‌లకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న సంఘాల నేతలు

మంచిర్యాలఅర్బన్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ నేపథ్యంలో అక్రమ అరెస్టులు, ఖమ్మం కార్పొరేట్ యాజమాన్య దాడులకు నిరసనగా స్థానిక ఐబీచౌరస్తాలో గురువారం దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మంలో బంద్ పిలుపు సందర్భంగా అనుమతి లేకుండా నడుస్తున్నా కార్పొరేట్ యాజమాన్ని బంద్ పాటించాలని సూచించినా నాయకులపై దాడులకు పాల్పడటాన్ని ఖండించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ టౌన్ అధ్యక్షుడు అనురుద్దీన్ పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

- సమ్మెలో కార్మికులు
- పారిశుధ్యం అస్తవ్యస్తం

సాక్షి ఫోకస్

జిల్లాలోని గ్రామాల్లో మల్టీపర్పస్ వర్కర్ల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్ల పక్క చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. శుభ్రం చేసేవారు లేకపోవడంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.



కోటపల్లి: మల్లంపేట గ్రామంలో పేరుకుపోయిన చెత్త

చెన్నూర్ నియోజకవర్గంలో..

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: మండలంలో మల్టీపర్పస్ వర్కర్ల సమ్మెతో గ్రామాల్లో చెత్త పేరుకుపోయింది. శివలింగాపూర్ గ్రామంలో రోడ్డు పక్కనే చెత్త కుప్పలుగా కనిపిస్తోంది. ప్రకృతివనం ముందు చెత్త పేరుకుపోయింది. కార్మికుల సమ్మెతో చెత్తబండ్లు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కోటపల్లి: వారం రోజులుగా పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమ్మెతో మండలంలోని 31 పంచాయతీలు కంపు కొడుతున్నాయి. 86 మంది సమ్మెలో ఉండడం, పారిశుధ్య పనులు చేపట్టకపోవడం వల్ల కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. మల్లంపేట గ్రామంలోని ప్రధాన రహదారిలో చెత్త పేరుకపోయింది. వర్షాకాలం మురుగు కాల్వల్లో నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారాయని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

భీమారం: మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. కాలనీల్లో పారిశుధ్యం లోపించింది. మండల కేంద్రంలోని కొత్తగుడిసెల్లో మురుగుకాలువల్లో చెత్త పేరుకుపోయింది. మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి.



భీమారం: కొత్తగుడిసెల్లో నిలిచిన మురుగునీరు



శివలింగాపూర్ ప్రకృతివనం ముందు చెత్త

జైపూర్: రోడ్లు, మురికి కాలువలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలో చెత్తాదారం పేరుకుపోయింది. చెత్తపై పందులు స్వైరవిహారం చేస్తుండడంతో గ్రామాల్లో అపరిశుభ్రంగా మారుతున్నాయి.



జైపూర్: ఇందారంలో పేరుకుపోయిన చెత్త



కాసిపేట మండలం ట్యాంకు బస్తీలోని మురుగుకాల్వలో పిచ్చిమొక్కలు



నెన్నెలలో పూడికతో నిండిన మురుగు కాలువ

బెల్లంపల్లి నియోజకవర్గంలో

బెల్లంపల్లి/తాండూర్: బెల్లంపల్లి, తాండూర్ మండలాల్లోని పల్లెల్లో చెత్త సేకరణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పారిశుధ్య పనులూ చేపట్టడం లేదు. గ్రామీణులు ఇళ్ల కూడళ్లు, రోడ్ల పైన చెత్త వేస్తుండడంతో ఈగలు, దోమలు ముసురుతున్నాయి. మురికి నీటి కాలువల్లో పూడిక నిండి నీరు నిలుస్తోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ చల్లించే పరిస్థితులు కానరావడం లేదు. మురికి కాలువలకు ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరిగి నీటి పారకం జరగడం లేదు. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామాల్లో దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నెన్నెల: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. నాలీలు పూడికతో నిండిపోయాయి. రోడ్ల పక్కనే చెత్తచెదారం దర్శనమిస్తోంది. నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వేమనపల్లి: మండలంలోని గ్రామాల్లో అపరిశుభ్రంగా నాలీలు, దుకాణ సముదాయాల వద్ద చెత్త నిల్వలు దర్శనమిస్తున్నాయి. చికెన్ సెంటర్ల వద్ద వ్యర్థాలు ఉండడంతో బస్టాండ్ పరిసరాలు కంపు కొడుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ చెత్త పేరుకుపోతోంది.

కాసిపేట: ప్రతీ గ్రామంలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే సిబ్బంది రాకపోవడంతో చెత్త ఇళ్లలోనే నిల్వ చేయాల్సి వస్తోంది. ముత్యంపల్లి, కాసిపేట, దేవాపూర్, సోమగూడెం(కె), లంబాడితండా గ్రామాల్లో కాలువలు సక్రమంగా లేక, బురద తొలగించక ఇబ్బందులు పడుతున్నారు. సోమగూడెం(బి)లో సోమవారం వారసంత వద్ద చెత్త తొలగించకపోవడంతో అలాగే ఉండిపోయింది.



మేదరిపేటలో రోడ్డుపక్కన చెత్త



బలరావుపేటలో రోడ్డు పక్కన చెత్తకుప్ప

మంచిర్యాల నియోజకవర్గంలో..

దండేపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తోంది. దీంతో రోడ్లు, ఇళ్లు, దుకాణాల ముందు చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మేదరిపేట నుంచి మామిడిపల్లికి వెళ్లే రోడ్డుపక్కన చెత్తకుప్ప పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది.

లక్సెట్టిపేట: గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. బలరావుపేటలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన రావడంతో ప్రజలు ముక్కు మూసుకుంటున్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



ఎమ్మెల్యేకు గొర్రె పిల్ల ఇస్తున్న గొల్లకుర్మలు

జన్నారం: బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని కవ్వాల్‌లో యాదవులకు గురువారం సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేశారు. అనంతరం కామన్‌పల్లి, సింగరాయిపేటలో పంచాయతీ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కవ్వాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కులవృత్తులకు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.లక్ష సాయం, గొల్లకుర్మల కోసం గొర్రెలు అందిస్తోందని తెలిపారు. రజక, మంగళి కులవృత్తుల వారికి ప్రభుత్వం వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇచ్చిందని గుర్తుచేశారు. వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం రాజరాం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఎంపీటీసీ రియాజోద్దీన్, సర్పంచులు రాథోడ్ లక్ష్మి, మానస, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, డైరెక్టర్లు జనార్దన్, నర్సాగౌడ్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కార్మికులకు చేయూత



మాట్లాడుతున్న బాల్క సుమన్

మందమర్రిరూరల్: స్వయం ఉపాధి రంగాల్లోని కార్మికులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని ప్రభుత్వ విప్ బాల్కసుమన్ అన్నారు. పట్టణంలోని పాత కేకే–5 సీఎస్పీ రోడ్డులోని గ్యాస్ గోదాం వద్ద భవన నిర్మాణ కార్మిక భవనం, ఫొటో,వీడియోగ్రాఫర్స్ భవన కార్యాలయాలను గురువారం ప్రారంభించారు. పద్మశాలీ కుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన మార్కండేయ ఆలయానికి జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మితో కలిసి భూమిపూజ చేశారు. బాల్క సుమన్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రోత్సాహకంగా రూ.5 లక్షల విరాళం ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యాలయాల కోసం పలు సంఘాల నాయకులు విప్‌నకు వినతిపత్రాలు అందించారు. కార్మికులు, బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



శాంపిళ్లను పరిశీలిస్తున్న డీఏవో కల్పన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో గురువారం ఎరువుల దుకాణాలను డీఏవో కల్పన తనిఖీ చేశారు. ఎరువుల ధరల పట్టికలతోపాటు రిజిస్టర్లను పరిశీలించారు. పీవోఎస్ మిషన్ ద్వారానే ఎరువులను అమ్ముతున్నారా లేదా పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే ఎరువులు విక్రయించాలని యజమానులకు సూచించారు. మంచిర్యాల, చెన్నూర్ ఏడీఏలు అనిత, జాడి బాపు, ఏవో కవిత ఉన్నారు.

డీఏవోకు వినతి

క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై డీఏవో కల్పనకు ఏఈవోలు వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా అర్హులైన రైతులను నిర్ణీత గడువు లోగా రైతు బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని కల్పన సూచించారు. చెన్నూర్ డివిజన్ వ్యవసాయశాఖ సిబ్బందితో ఆమె మాట్లాడారు. వరిలో వెదజల్లే పద్ధతులపై రైతులకు తెలియజేయాలన్నారు. పప్పు దినుసులు, ఆయిల్‌పాం సాగు ప్రాముఖ్యతను వివరించాలన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



హాజీపూర్‌లో నిరసన తెలుపుతున్నకార్మికులు

బెల్లంపల్లి/నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జన్నారం/మందమర్రిరూరల్/తాండూర్/కాసిపేట: జిల్లాలో పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గురువారం నాటికి ఎనిమిదో రోజు చేరింది. కార్మికులు వినూత్నంగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జన్నారంలో కార్మికులు సమ్మెలో కూర్చొని నిరసన తెలిపారు. మందమర్రిలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజారమేశ్, కాసిపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవిలు కార్మికులకు మద్దతు తెలిపారు.

ఘనంగా బోనాల జాతర



ఊరేగింపుగా వస్తున్న భక్తులు

నస్పూర్: పట్టణంలోని వారసంత వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలతో డప్పుచప్పుళ్లతో భక్తులు బోనాలతో సీసీసీ కార్నర్ నుంచి ఊరేగింపుగా సుందరయ్య కాలనీకి వచ్చారు. వారసంత స్థలం వద్ద గల అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ తరపున ప్రేంసాగర్‌రావు–సురేఖ స్థానిక నాయకుల ద్వారా రూ.5 వేల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్ సంధ్యారాణి, డీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, పాక్స్ డైరెక్టర్ మధు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: స్థానిక ఆర్‌కే3 గని సమీపంలో గల కనకదుర్గాదేవి ఆలయంలో గురువారం భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. బోనాలు సమర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

బోనాల జాతర ఏర్పాట్ల పరిశీలన

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ ఆలయం వద్ద ఈనెల 16న నిర్వహించనున్న మైసమ్మ బోనాల జాతర ఏర్పాట్లను పట్టణ ఎస్సై అశోక్ గురువారం పరిశీలించారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. హైవే పక్కనే జాతర జరుగుతున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు, భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్ పాదయాత్ర

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు, బీరెల్లి గ్రామాల్లో గురువారం గడప గడపకూ కాంగ్రెస్ పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్మ రాజమల్లాగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల బాపాగౌడ్, యువజన మండల అధ్యక్షుడు జాడి రాజేందర్, మాజీ ఎంపీటీసీ కొల్లూరి లచ్చన్న, నాయకుడు బాపు ఉన్నారు.

మామిడిపల్లిలో పశుగ్రాస వారోత్సవాలు

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లిలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. పశుగ్రాసాల పెంపకంపై పశువైద్యాధికారి ధన్‌రాజ్ రైతులకు అవగాహన కల్పించారు. సూపర్ నెపియర్, హెడ్జ్‌లూసర్న్, అవిస పశుగ్రాసాల ప్రాముఖ్యతను వివరించారు. రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

చెన్నూర్: ఎనగుట్ట కాలనీలో గల మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమెరికాలో ఉద్యోగం చేస్తున్న చెన్నూర్‌కు చెందిన చిలువేరు సంతోశ్, వినేశ్‌లు గురువారం స్థానిక ఎంఈవో రాధాకృష్ణమూర్తితో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం కరుణాకర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పవన్‌కుమార్, గణేశ్, భాస్కర్, మురళి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమంలో పాఠశాల గ్రంథాలయానికి ఉపాధ్యాయులు యోగేశ్వర్, చిమ్మని శ్రీనివాస్ గురువారం పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయులు ఉదయ్, శ్రీనివాసవర్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: కిష్టంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు సొంతంగా పుస్తకాలు కొనుగోలు చేసి ఎంఈవో ప్రభాకర్‌తో అందజేశారు. తొలిమెట్టులో భాగంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, పఠనాభివృద్ధి కార్యక్రమాలను ఎంఈవో పర్యవేక్షించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మందమర్రిరూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఏరియాలోని సింగరేణి హైస్కూల్ విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం పురుషోత్తమ్ ఉన్నారు.

నిత్యావసరాల పంపిణీ

శ్రీరాంపూర్: ఊరు శ్రీరాంపూర్‌లోని శ్రీసాయి దృష్టి అంధుల పాఠశాలకు ఆర్కే 8 కాలనీ సాయిబాబా ఆలయ పూజారి గోవర్ధన వెంకటరమణచార్యులు నిత్యావసరాలు పంపిణీ చేశారు. తండ్రి గోవర్ధన కొండమాచార్యులు జ్ఞాపకార్థం గురువారం వీటిని అందించారు. పాఠశాల ఇన్‌చార్జి వసుమతి ఉన్నారు.

చేతి గ్లౌజులు అందజేత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మహిళా తరంగిణి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్మికులకు జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో చేతి గ్లౌజులు పంపిణీ చేశారు. 23, 24, 25 వార్డుల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి వీటిని పంపిణీ చేసి, మిగిలిన వార్డుల్లో కార్మికులందరికి మూడు జతల గ్లౌజులు అందించినట్లు మమత సభ్యులు తెలిపారు. వార్డు కౌన్సిలర్ సంజీవ్, మమత గౌరవ అధ్యక్షురాలు ఇందిరాదేవి, అధ్యక్షురాలు శ్రీదేవి గౌడ్, కార్యదర్శి పద్మారెడ్డి, కోశాధికారి జ్యోత్స్న చంద్రదత్, సంయుక్త కార్యదర్శి చంద్రకళ, సలహాదారులు చిదానంద కుమారి, శృతి, రమాదేవి, భాగ్యలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

బీఎస్‌రావు మృతికి నివాళి

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లో మృతి చెందిన శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ బీఎస్‌రావు చిత్రపటానికి స్థానిక శ్రీ చైతన్య పాఠశాల ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ జోబిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

భీమిని: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా, ఒక ఆటోడ్రైవర్ మద్యం తాగినట్లు తేలింది. ఇతనిపై కేసు నమోదుతోపాటు ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహన పత్రాలు లేని పలువురికి జరిమానా విధించారు.

రేపు మడేలయ్య బోనాల జాతర

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో శనివారం మడేలయ్యస్వామి బోనాల జాతర నిర్వహిస్తున్నామని రజక సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన బోనాల జాతర సన్నాహక సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బోనాల శోభాయాత్ర ఉదయం 10 గంటలకు విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమై హమాలీవాడలోని మడేలయ్య ఆలయం వరకు సాగుతుందన్నారు. రజకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్‌చైర్మెన్ ముఖేష్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ శంకర్ హాజరవుతారని అన్నారు.

పల్లెల్లో సోషల్ ఆడిట్ గ్రామసభలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని 17 పంచాయతీల్లో 12 నుంచి ఈజీఎస్ సోషల్ ఆడిట్ గ్రామసభలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా దొనబండ, ర్యాలీ, ముల్కల్ల, గఢ్‌పూర్, వేంపల్లిలో గురువారం గ్రామసభలు జరిగాయి. గత మూడేళ్లుగా ఈజీఎస్ కింద గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన సామాజిక తనిఖీ బృందం తయారు చేసిన నివేదికను చదివి వినిపించారు. ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఎంపీఓ మల్లయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు, స్థానికులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

భీమిని: కొత్త పట్టా పాస్ పుస్తకం వచ్చినా భీమిని, కన్నెపల్లి మండలాల్లోని రైతులు తమ ఏఈవోల వద్ద రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈలు విజయ్, శ్రీకాంత్ పేర్కొన్నారు. రైతుబీమాకు కావల్సిన పత్రాలు పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ జిరాక్స్ తీసుకుని సంబంధిత ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. రైతు బీమాకు చివరి తేదీ ఆగస్టు 5న చేసుకోవాలని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా.బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, గ్రూపుల్లో ప్రవేశాలు పొందవచ్చని సూచించారు. విద్యార్థులు ఇతర వివరాలకు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రామకృష్ణ సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

చెన్నూర్: పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి సౌకర్యాలు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా సూపరింటెండెంట్ నవీన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు క్రాంతికుమార్, అన్నమయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య పేర్కొన్నారు. హరితహారంలో భాగంగా పట్టణంలోని 7, 8వ వార్డుల్లో గురువారం మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శ్రీహరి ఉన్నారు.

16న బీసీల నిరసన దీక్ష

పాతమంచిర్యాల: బీసీ జనగణన సాధన కోసం జిల్లా కేంద్రంలో ఈ నెల 16న చేపట్టే నిరసన దీక్షను విజయవంతం చేయాలని బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డే మనోహర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో నాయకులతో కలిసి నిరసనదీక్ష కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. రాజేశం, రామదాసు, మల్లయ్య, చంద్రమౌళి, రాజన్న, చరణ్, రాములు, మహేశ్ పాల్గొన్నారు.

దండేపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

దండేపల్లి: మండల కేంద్రాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపిక చేయడంతో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఇంట్లో పారిశుధ్య వివరాలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. గురువారం జరిగిన సర్వేను ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, సర్పంచ్ చంద్రకళ పరిశీలించారు.

మైనార్టీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

రామకృష్ణాపూర్: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించనున్న రుణాల కోసం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకు అధికారులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 70 మంది మైనార్టీలు హాజరయ్యారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాసిపేట: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఉచిత విద్యుత్ పేరుతో రిటైర్డ్ ఇంజినీరింగ్ అధికారులను నియమించుకుని భారీ కుంభకోణానికి తెరలేపారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. 8 గంటల ఉచిత విద్యుత్ అందించడం లేదని పేర్కొంటూ మండలంలోని కోండపూర్ సబ్‌స్టేషన్ వద్ద ప్రధానరోడ్డుపై గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. మండల మాజీ అధ్యక్షుడు సిద్ధం తిరుపతి, ఎంపీటీసీలు పార్వతి మల్లేశ్, పద్మశంకర్, భీంరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాకేశ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షాకీర్, రాజమౌళి, కనకరాజు, మాజీ సర్పంచులు శంకరయ్య, ప్రభాత్‌రావు, నాయకులు రమేశ్, శివ, మహంకాళి, అచ్యుతారావు ఉన్నారు.